# శాంతి హీనులు

ఒక స్త్రీ, ఒక పురుషుడికి ప్రేమ లేఖలు రాయ వచ్చును. అందులో ఎవ్వరికీ అభ్యంతరం వుండ నక్కర్లేదు. కానీ, దానికి మాత్రం మంచి చెడ్డలు వుండవా? ఆ స్త్రీ ఉన్నతురాలా, ఆ పురుషుడు సత్య వంతుడా, ఆ ప్రేమ శాశ్వతమా — అని ఇతరులు తర్జన భర్జనలు చెయ్యకపోయినా, ఆ మంచిచెడ్డలు అసలు వాళ్ళిద్దరైనా ఆలోచించుకోనక్కరలేదా?

ఆ స్త్రీ, తన భర్తచాటున ఆ పని చేస్తూ వుంటే? ఆ భర్త ఎంత పనికి మాలినవాడైనా, ఆ స్త్రీకి ఇదా మార్గం?

అమె ఇచ్చే ఆ ప్రేమ చీటీలు పట్టుకెళ్ళేది అమె కొడుకే అయితే? ఆ కొడుకు పదేళ్ళ పసివాడు అయితే?

ఆ కృష్ణని చూసినప్పుడు నా మనసు చాలా కలతపడుతుంది. .... తల్లి చెప్పిన పని ఏదైతేనేం? .... తప్పొప్పుల సంగతి పిల్లలకెందుకు? — అను కోవాలా?

ఆ ఉత్తరం తెచ్చి కృష్ణ, ప్రసాద్‌కి ఎంత సిగ్గు పడుతూ ఇస్తాడో! ప్రసాద్ ఆ అబ్బాయిని ఎంత నిర్లక్ష్యంగా చూస్తాడో! ఆ దృశ్యం ఒక్కసారి చూస్తే తెలుస్తుంది. .... ఒక్కసారేమిటి? .... అనేకసార్లు చూస్తు న్నాడు తను. ఏమీ చెయ్యలేం. ప్రపంచంలో ఎన్నో నీచాలు .... మోసాలు .... అసహ్యాలు .... వింటూ చూస్తూ ఏమీ చెయ్యలేం, భరించడం తప్ప!

ఆలోచనల్లో మునిగి కూర్చున్నాడు వేణుగోపాల్.

అతని మనసంతా ఆర్ద్రతతో స్పందిస్తోంది. కొన్నాళ్ళనించీ అతని ఆలోచనల్లో కృష్ణే ఎక్కువ చోటు ఆక్రమిస్తున్నాడు.

ఆ అబ్బాయి ఆరో క్లాసు చదువుతున్నాడు. సన్నగా పొడుగ్గా కొంచెం తెల్లగా .... మంచి వొత్తు జుట్టు, తెలివైన కళ్ళు, ఎప్పుడూ ఉత్సాహంగా ఆడుతూ కనిపిస్తాడు. అతని కిద్దరు చెల్లెళ్ళు. వాళ్ళు కూడా అప్పుడప్పుడూ ప్రసాద్ దగ్గరికి వొస్తూ వుంటారు. ప్రసాద్ ఆ పిల్లలకు ఎంతో జాలిపడి దయగా ఇచ్చి నట్టు డబ్బులిస్తాడు. ఐస్ ఫ్రూట్లవీ కొనిపెడతాడు. ఆ పిల్లలు ప్రసాద్‌ని "మామయ్యగారూ!" అని పిలు స్తారు.

ఆమె పేరు 'పద్మావతి' అని ప్రసాద్ చెప్పాడు.

"పద్మావతి మాకు దూరపు చుట్టం. నాకు వరసకి అక్క అవుతుంది" అన్నాడెప్పుడో! ఆమెని అలాగే పిలుస్తాడతను. వాళ్ళింటికి రాకలూ పోకలూ, అప్పు డప్పుడూ వాళ్ళింట్లో కాఫీలూ, అన్నీ తెలుసు వేణుకి.

పద్మావతి భర్తకి ఆ మధ్య ఏదో జబ్బుచేస్తే, ఆస్పత్రి పనుల్లో ప్రసాద్ చాలా సహాయంగా తిరిగాడు. డబ్బుకూడా సర్దుబాటు చేశాడు. అతని ఉపకార గుణం చూస్తే వేణుకి అప్పుడు చాలా గౌరవం కలిగింది.

కొన్నాళ్ళ కిందట, వాళ్ళిద్దరూ రిక్షాలో కనపడితే, చాలా ఆశ్చర్యపడ్డాడు వేణు, అంత దగ్గిర బంధువలా అని!

ప్రసాద్ రిక్షా దిగి గబగబా వేణు దగ్గిరికి వొచ్చి — "అక్క ఏదో కొనుక్కుంటానంటే తీసుకొచ్చాను. డబ్బు సరిపోయేలా లేదు. ఏమన్నా వుంటే చూడ వోయ్" అన్నాడు.

వేణు తన దగ్గిర వున్నమటుకు ఇచ్చాడు. ఇతర్ల గురించి ఎక్కువ ఆలోచించే నైజంకాదు అతనిది. కానీ, నెల రోజుల కిందట అనుకోని విధంగా ఏమీ ఆలోచించకుండానే చాలా స్పష్టంగా తెలిసింది అసలు విషయం.

వేణుగోపాల్ వొక ఫ్రెండ్ దగ్గిరికి బయల్దేరుతూ రాత్రికి రానని చెప్పి వెళ్ళాడు. అక్కడ అతను దొరక్క రెండో ఆట చూసి వొంటిగంట ప్రాంతంలో రూమ్ కొచ్చాడు. లోపల్నించి మాటలు వినపడి, సంగతి తెలిసి, నిర్ఘాంతపోయాడు. వాళ్ళనేదో నమ్మించి మోసం చేసినట్టూ, రాత్రికి రానని చెప్పి ఇప్పుడు హఠాత్తుగా దాడిచేసి వాళ్ళ రహస్యం పట్టుకున్నట్టూ వాళ్ళనుకుంటారేమోనని సిగ్గుపడి పోయాడు. అంత కన్నా ముందు, ఆ 'అక్కాతమ్ముళ్ళ అసలు సంబంధం ఇదా' అని బాణం దెబ్బతిన్న పిట్టలాగ విలవిల్లాడాడు.

భుజంనిండా చెంగు కప్పుకుని తల వొంచుకుని తడబడే నడకతో వెళ్ళిపోయిందామె. వరండా చివరికి పోయి నించున్న వేణు అపరాధిలాగా లోపలికెళ్ళాడు.

ప్రసాద్ అద్దంవేపు తిరిగి తల దువ్వుకుంటు న్నాడు, అంత అర్ధరాత్రి! ఇద్దరి మధ్యా వొక్కమాట కూడా జరగలేదు. లైటార్పిపడుకున్నారు!

వేణుగోపాల్ తనకి ఊహ తెలిసినప్పట్నుంచీ 'తప్పు .... అవినీతి' అనుకునే స్త్రీ పురుష సంబంధాల గురించి వింటూనే వున్నాడు. మనుషులు లోక నీతు లకు ఎంత విలువ ఇస్తారో, ఈ అవినీతి సంబంధా లకు అంత లొంగిపోతారు. సంఘానికి పవిత్రతే గొప్ప ఆదర్శం. మనుషులందరికీ మర్యాదస్తులుగా కనపడా లనే ఆశ వున్నప్పటికీ, ఈ మనుష్యుల మధ్యే ఎన్నెన్నో తప్పులూ అపరాధాలూ రహస్యాలూ జరుగుతూనే వుంటాయి. అందుకే వేణుగోపాల్‌కి ఏ రహస్య సంబంధం గురించి విన్నా 'ఇది జీవితం. ఇది ఇంతే. వాస్తవం ఇంతే' అనిపిస్తుంది.

కానీ, ఇక్కడ ఈ ఇద్దరి మధ్యా ఆ చిన్న అమాయ కుడు .... అతను ఉత్తరం దాచిన జేబు గట్టిగా పట్టు కుని, చుట్టూ మనుషుల్ని భయంగా చూడటం కొత్తగా నేర్చుకుంటూ, ప్రసాద్ కోసం రహస్యంగా వెతికి, ఎంతో వినయంగా చటుక్కున ఆ ఉత్తరం తీసి ఇచ్చే తీరుచూస్తే ....!

ఆ దృశ్యమే ఎప్పుడూ వెన్నాడుతూ వేణుగోపాల్ మనసంతా దిగులుపరుస్తూ ఉంటుంది. అతను ప్రసాద్‌తో ఏడాదిపైగా ఒకే రూములో కలిసి వుంటున్నా ఇద్దరిమధ్యా ఎక్కువ చనువు లేదు. కొత్తగా బయట పడ్డ ఈ విషయం గురించి గుర్తొస్తే ఇతర్ల విషయాలు తనకి అనవసరమేమో అనిపిస్తోంది కొన్ని సార్లు. ఆమె పరిస్థితి ఏమిటో! ఆమె సమస్యలేమిటో! ఆమెకి ఇంకో మార్గం లేదేమో! ఆ అబ్బాయి గురించి అయినా ఇంత బాధ ఎందుకు తనకి? కన్నతల్లి కన్నా ఆత్మీయుడా తను? — అనిపిస్తోంది అప్పుడప్పుడూ.

కానీ .... మళ్ళీ, ఒక సాయంత్రం .... వీధిలో పిల్లలమధ్య ఆడుకుంటోన్న కృష్ణని ప్రసాద్ సైగచేసి పిలుస్తోంటే, వేణుగోపాల్‌కి చాలా కోపం వొచ్చింది — "ఆ ఉత్తరం ఇలా తే. నేను పట్టుకు వెళ్తాను. ఆ అబ్బాయిని ఆడుకోనియ్యి! చిన్నపిల్లలకి అలాంటి పని ఎందుకు?" అందామనుకున్నాడు.

కృష్ణ ఆటలో లీనమై వెంటనే రాలేదని ప్రసాద్‌కి కోపం వొచ్చి "ఏయ్! నిన్నే" అంటూ ఆజ్ఞాపిస్తున్నట్టు మళ్ళీ మళ్ళీ పిల్చాడు. తప్పనిసరై కృష్ణ ఆట మాను కుని భయపడుతూ వొచ్చి నిలబడ్డాడు. "పిలుస్తోంటే వినిపించుకోవేం?" అని విసుక్కుని .... అతని జేబులో కవరుపెట్టి "జాగ్రత్త, డబ్బుంది. గంతులేసి పారేసేవు. వెళ్ళి మీ అమ్మకియ్యి" అని అతన్ని పంపించేసి, తనుగూడా బయటికి వెళ్ళిపోయాడు. అప్పటి వరకూ అతను వేణు ఎదట అంత బట్టబయలుగా ప్రవర్తించ లేదు. ఇక ఆ దాపరికం కూడా పోయింది.

ఎక్కువ రోజులు ఇలా జరిగితే చిన్నపిల్లల ప్రవ ర్తన తప్పుదారి పట్టదా? ప్రసాద్‌కి ఇంత చిన్న విషయం ఎందుకు తెలీటం లేదు?

వేణుగోపాల్ పుస్తకం మూసి లేచి వరండాలోకి రాబోతోంటే ప్రసాద్ వచ్చాడు. ఇద్దరూ క్యారియర్ విప్పుకుని అన్నాలు తిన్నారు. ప్రసాద్ తను చూసి వొచ్చిన సినిమా కబుర్లు వెటకారంగా విమర్శిస్తూ చెప్పి వేణూని నవ్వించాలని చూశాడు. పదకొండు దాటింది. ఇద్దరూ పక్కలెక్కారు. చాలా నిశ్శబ్దం.

చాలా సేపటికి. "నిద్రపోతున్నావా ప్రసాద్!" అన్నాడు నెమ్మదిగా వేణుగోపాల్.

"లేదు, రావటం లేదు నిద్ర. ఏం, ఎందుకూ? నీకూ నిద్రపట్టటం లేదా?"

"అసలలాంటి సినిమా లెందుకు చూస్తావు?"

"ఇంక మానెయ్యాలోయ్ రేపట్నించీ."

"అన్నీ ఉత్త కబుర్లే. నువ్వు మొన్నేమన్నావు? ఈ మాటే అన్నావు?"

ప్రసాద్ తప్పు వొప్పుకున్నట్టు మాట్లాడలేదు. కొంచెం నవ్వాడు.

"ప్రసాద్! నిన్నో సంగతి అడగనా!"

ప్రసాద్ మళ్ళీ నవ్వి — "ఏం అడుగుతావో తెలుసు. పద్మావతి సంగతేగా?" అన్నాడు, ఏం అడి గినా తనకి లక్ష్యం లేదన్నట్టు.

ప్రసాద్ నిర్లక్ష్యానికి వేణు అదిరిపడ్డాడు.

"అబ్బ! అది కాదు ...." అన్నాడు తడబడుతూ.

"ఎందుకంత మొహమాటపడతావు? నా కర్థ మైందిలే. తప్పు అని చివాట్లు పెడదామనుకుంటు

న్నావు. అంతేగా?"

చేసే పనికి సిగ్గులేకుండా ఇంత దబాయింపా!

"అవును, నాకు తప్పే అది! నీకు కాదేమో!"

"అందరికీ తప్పేగా అది?" అంటూ లేచి ప్రసాద్ సిగరెట్ వెలిగించుకుని మంచంమీద కూర్చున్నాడు — "నువ్వెప్పుడో అడుగుతావని నేనూ ఎదురు చూస్తున్నాను. కానియ్యి మరీ" అన్నాడు లెక్కలేనట్టు, హాస్యంలాగ.

ఇంత మొండి మనిషితో మాటలేమిటి? కానీ .... ఒక్కటన్నా అడగాలి. ".... నువ్వు ఆవిణ్ణి అక్కా అని పిలుస్తావనుకుంటాను" అన్నాడు.

ప్రసాద్ కొంచెం ఇబ్బందిగా నవ్వి — "మానేస్తాలేవోయ్, ఇంక అలా పిలువను" అన్నాడు.

"నీకో అక్క వుందికదా? ఆ అక్కకీ ఈ అక్కకీ తేడా ఏమిటి?"

"అఁ, ఏముంది ఈ వరసల్లో?"

"ఏముందని 'అక్క'వరసే పెట్టుకున్నావు?"

"నేను పెట్టుకోటం ఏంటి? ఆమె నాకు అక్కే అవుతుంది."

"అక్క అయ్యే మనిషి మీద ...."

" 'వదిన' అయ్యే మనిషి అయితే ఫర్వాలేదా?"

"వదినా, అక్కా ఒకటేనా?"

"అబ్బా, ఊరుకోవోయ్! ఏదో చేస్తాం లోకం కోసం!"

"లోకాన్ని మనం మభ్యపెడితే మనల్ని లోకమూ అంతే చేస్తుంది. అంత పిరికితనం ఎందుకూ? మీరిద్దరూ అక్కా తమ్ముళ్ళయితే ఎవరిక్కావాలి? బావా మరదళ్ళయితే ఎవరిక్కావాలి? ఇంకోటయితే ఎవరిక్కావాలి? ఆ మంచి చెడ్డలు మీకే వుండాలి!"

"ఎవరిక్కావాలా? అందరికీ కావాలి, ఏ మనిషి ఎక్కడ ఏం సుఖపడిపోతున్నాడో, ఎంత స్వేచ్ఛగా ఎంత ఆనందంగా బతికేస్తున్నాడో, అందరికీ లెక్క తేలాలి. ఎవ్వరూ ఇతర్ల విషయాలు పట్టించుకోని వాళ్ళయితే, లోకం ఇంత భూతంలాగా ఎందుకు కనబడుతుంది అందరికీ? నేనా వరస పెట్టుకోబట్టే మా వేపు ఎవ్వరూ కన్నెత్తి చూడ్డం లేదు. ఆవిడ భర్తకూడా డబ్బుగల బావమర్ది దొరికాడని చాలా మురుస్తున్నాడు. నేనూరికే ఏ పరిచయస్తుళ్ళాగానో .... ఏ మేనత్త కొడుకులాగానో వాళ్ళింటికి వెళ్ళొస్తూ వుంటే .... నువ్వన్నావే ... లోకానికేం పడుతుందని .... పిచ్చి పడుతుంది. జాతర్లలో ఎగురుతారు చూశావూ .... అలాంటి పూనకం వొస్తుంది. అక్క ముసుగో అన్న ముసుగో వేసుకుంటే కావలసినంత గౌరవం! .... ఆ ముసుగే వేసుకుంటే పోదూ?"

"లోకాన్ని తప్పుపడుతున్నావే! తప్పు —మీదా, లోకానిదా? అక్కాతమ్ముళ్ళ మధ్య ఇలాంటి ప్రవర్తన వుంటే, లోకం తప్పు పట్టిందంటే, అది దాని తప్పా?"

"నువ్వు నన్ను వదిలేటట్టు లేవే!"

"నీ కిష్టం లేకపోతే వదిలేస్తాలే. అది కాదు. లోకం విషయం వొదిలేయ్. అసలావిణ్ణి అక్కా అని పిలవటానికి నీకెలా మనస్కరిస్తోంది? తల్లి భావం .... సోదర భావం ... పెట్టుకున్న తర్వాత ...."

"ఆమెమీద నాకున్నది సోదర భావం కాదు. వరస. ఉత్త వరస."

"ఆ వరసలోనే శరీర సంబంధాల్ని ఊహించలేని మంచి భావం జీర్ణించివుంటుందే మనకి!"

"మనకి కాదు, నీకు! ఈ వరసలమీదా, ఈ పిలుపులమీదా నా కెప్పుడూ గౌరవం లేదు! నువ్వనే ఆ 'మంచి' మానవత్వపు విలువలు నా కెక్కడా కనపళ్ళేదు. మా అమ్మే వుందనుకో, నన్నూ మా తమ్ముణ్ణీ దేవుళ్ళని చూసినట్టు చూస్తుంది. ఆడపిల్లల్ని పురుగుల కన్నా హీనం చేస్తుంది. అందరూ కన్నబిడ్డలే అయినప్పుడు తల్లి హృదయానికి ఆ తేడా లెందుకు? ఆవిడ ప్రేమలో ఉత్త లోకాచారం తప్ప నాకెక్కడా మంచితనం కనపడదు.

సోదర ప్రేమలంటావా? 'అన్నా చెల్లెళ్ళ' సినిమాలు చూసి చెడిపోయావేమోగానీ, మనుషుల మధ్య అలాంటి ప్రేమ లెక్కడా లేవు. మా ఊళ్ళో ఇద్దరన్నదమ్ములు, పెరట్లో వొక్క గజం చోటుకోసం తలకాయలు బద్దలుకొట్టుకుని కోర్టులకెక్కి బద్ధశత్రువులయ్యారు. నిత్యం ఇలాంటి వెన్నో చూస్తూ కూడా ఏమిటో పవిత్రతలంటా వేమిటోయ్ వేణూ? ఏం వరసలు? ఏం విలువలు? నువ్వింత బాధపడాల్సిందేమీ లేదు ఇందులో."

"ఇతర్ల దగ్గిర ఏ విలువలూ లేవంటున్నావు, అంత తెలిసిన వాడివి, నీ ప్రవర్తనలో ఆ విలువలు

ఉంచుకోరాదూ? నువ్వుకూడా ఇతర్లలాగే ప్రవర్తిస్తే, వాళ్ళకీ నీకూ తేడా యేమిటి? నువ్వూ తప్పుపనే చేస్తూ అందర్నీ ఎందుకు తప్పుపడుతున్నావు?"

"సరేలే, అయితే ఇక నేనెవ్వర్నీ తప్పుపట్టన్లే! నేన నేదేమిటంటే ఈ వరసల్లో, పిలుపుల్లో ఏమీ లేదోయ్!"

"పోనీ ప్రసాద్! మీ వరసలూ .... మీ గొడవలూ నా కనవసరం. కృష్ణ సంగతైనా ఆలోచించు."

"కృష్ణ సంగతేమిటి!"

"ఆ అబ్బాయి ఏమన్నా అనుకోడూ మీ గురించి?"

"ఏమనుకుంటాడు?"

"ఆ ఉత్తరాలవీ ఆ పిల్లాడితో పంపటం బాగోలేదోయ్! మీ ఇద్దరిమధ్యా ఇతర్లకి తెలియకూడని తప్పేదో వుందని అతనికి తెలుసు. మీరు లోకాన్ని ధిక్కరించి నిర్భయంగా ప్రవర్తిస్తే అది వేరు. ఇలాంటి రహస్యాల్లోకి చిన్నపిల్లల్ని లాగటం వాళ్ళ భవిష్యత్తుకి మంచిది కాదు."

ప్రసాద్ నవ్వాడు — "అందరి గొడవలూ ఇలా ఆలోచించి బాధపడటం నీ భవిష్యత్తుకి చాలా మంచి దనుకుంటున్నావా?"

"కళ్ళ ముందు ఏం కనపడుతోన్నా దాన్ని పట్టించు కోకుండా, నా సుఖం మాత్రమే నేను చూసుకునే భవిష్యత్తు నా కక్కర్లేదు."

ప్రసాద్ పక్కసర్దుకుని పడుకుంటూ "అతని గొడవ నీకెందుకు వూరుకోవోయ్! అదంతా వాళ్ళమ్మకి తెలుసులే" అని ఆ మాటలు కొట్టిపారేశాడు.

వేణుకి చాలా కోపం వొచ్చింది — "అవును, మీ అమ్మకి ఎంత తెలుసో, వాళ్ళమ్మకీ అంత తెలుసు. పిల్లల మంచిచెడ్డలన్నీ తల్లులకు మాత్రమే తెలు స్తాయి!"

"లేకపోతే ఎదురింట్లో స్టూడెంట్స్‌క్కూడా తెలు స్తాయా? ఎందుకొచ్చిన రభస? పడుకోవోయ్, ఇలాంటివన్నీ ఆలోచిస్తే పిచ్చాసుపత్రి వొక్కటే శరణ్యం మనకి."

"నీకు కాదులే. నువ్వు పిచ్చి పట్టించుకోవు, లోకా నికి పట్టిస్తావుగానీ."

ప్రసాద్ నవ్వాడు — "అయితే నిజంగా లోకానికి సేవ చేసేది నేనే. అప్పుడైనా లోకం తనని తను ఉద్ధరించుకోవటం నేర్చుకుంటుంది .... ఇంక నన్ను పడుకోనిస్తావా? మళ్ళీ పలకరించావంటే వూరుకోను" అంటూ దుప్పటి కప్పుకుని కళ్ళు మూసుకున్నాడు.

వేణుగోపాల్ ఉడికిపోయాడు. తను చిన్నపిల్లాడి కోసం చెప్పినా ప్రసాద్ కేమీ పట్టదా? కృష్ణతో ఆ ఉత్తరాల వ్యవహారం అన్నా ఆపించాలనుకున్నాడు. ఆ అబ్బాయిమీద ఇతని పెత్తనం ... భయపడుతూ బెదురు చూపుల్తో అతను తిరగటం .... ఇక అంతే నన్నమాట!

ప్రసాద్‌కి ఇంత చిన్న విషయం ఎందుకు అర్థం కావటంలేదు? ఎన్నో తెలిసినట్టు మాట్లాడతాడు. లోకాన్నంతా కాచివడపోసినట్టు మాట్లాడతాడు! కానీ, అతను చెప్పే మాటలు అతనే పట్టించుకోడు. అందరి మీదా విమర్శలే! తన నడతని తను చూసుకోడు! మరీ తెలివిమాలినవాడు కాడు. తెలివి ఎక్కువయ్యేనేమో ఈ పైత్యం!

అప్పుడే ప్రసాద్ నిద్రలోకి జారిపోయాడు.

వేణుగోపాల్ అశాంతిగా కళ్ళు మూసుకున్నాడు.

★ ★ ★

కృష్ణ వేణుకి బాగా చనువయ్యాడు. అతను వేణుగోపాల్‌ని 'మామయ్య గారూ' అని పిలవబోతే వేణు ఎప్పటికప్పుడే వారించాడు — "నన్నలా పిలవకు క్రిష్ణా! నా కిష్టం వుండదు. ఇద్దరు మనుషుల మధ్య ఏదో వొక బంధుత్వమే వుండాలా? మనం స్నేహి తులం అనుకో" అన్నాడు.

"అయితే మిమ్మల్నేమని పిలవనూ?" అని అడిగాడు కృష్ణ అమాయకంగా.

"నా పేరు నాకుందిగా? నా పేరుతోనే పిలూ! 'వేణుగారూ' అని పిలూ!" అన్నాడు వేణు. అలా అన్నాడుగానీ, వేణుకి అదీ అంతగా నచ్చలేదు. కానీ, 'మామయ్య గారూ' అని పిలిస్తే, ఆ పిలుపుని అసలే భరించలేకపోయాడు. ప్రసాద్‌నీ అలాగే పిలిచి, తననీ అలాగే పిలిస్తే, .... తనూ అలాంటి మామయ్యేనా?' పోనీ 'బాబయిగారూ' అని పిలవమంటే? ఏమో! ఎటూ తేల్చుకోలేకపోయాడు.

కృష్ణ చొరవగా 'వేణుగారండీ!' అని పిలుస్తున్నాడు అప్పుడప్పుడూ.

కృష్ణ చదువు సంగతులు కూడా తెలుసుకుని అవసరమైతే పాఠాలో, లెక్కలో చెప్తూ వుంటాడు వేణు. అతన్ని చూసినప్పుడల్లా కరిగి నీరైపోతాడు వేణు — 'చుట్టూ ఎలాంటి హీన పరిస్థితులున్నా, వాటి ప్రభావానికి లొంగని ఆలోచన నేర్పాలి ఇతనికి' అనుకుంటాడతను.

ఉత్త ఆలోచనలకన్నా వాస్తవ పరిస్థితులకున్న శక్తి ఎంత బలమైందో తొందరగానే అర్థమైంది వేణుకి.

ప్రసాద్ పద్మావతికోసం ఐదు రూపాయలు పంపిస్తే అందులో ఒక రూపాయ కృష్ణ దాచుకుని నాలుగు రూపాయలే ఇచ్చాడని చెప్పాడు తల్లికి. ఆ సంగతి తర్వాత బయటపడింది.

ప్రసాద్ మండిపడుతూ "చూడు, నీ శిష్యుడెంత ఘనకార్యం చేశాడో! ఇక ఇలాగే మొదలుపెడతాడు కాబోలు. కాస్త మందలించు!" అని ఫిర్యాదు చేశాడు వేణుకి.

అంతా విని "మందలించాల్సింది అతన్ని కాదు, మీ ఇద్దర్నీ. అతని తప్పుకి మీరిద్దరూ శిక్ష వేసుకోండి" అన్నాడు వేణు.

"చాల్లేవోయ్! నీ కబుర్లకేం?" అని విసుక్కున్నాడు ప్రసాద్.

సాయంత్రం కృష్ణ వొచ్చినప్పుడు అతని కాళ్ళ మీదా, చేతులమీదా ఉబ్బరించిన చారలు చూసి కంగారు పడి "ఏమిటివన్నీ?" అని అడిగాడు వేణు.

కృష్ణ మాట్లాలేదు. ఏడుపుమొహం పెట్టి నించున్నాడు.

వేణు ఊహించాడు. ఏదో జరిగింది. ఎవరో కొట్టారు. బహుశా తల్లి .... ఆ రూపాయికా?

"మరెందుకలా చేశావు?" అనబోయి ఆగాడు. అతని చేతిమీద నెమ్మదిగా నిమిరి ఓదార్చాడు స్పర్శతో.

కృష్ణ పుస్తకాలు తెరిచి కూర్చున్నాడు. రాయడానికి పెన్సిల్ తీశాడు.

"పెన్నేమైంది?" అంటే, "మా మేస్టారు తీసుకున్నారు. ఇవ్వలేదు" అన్నాడు.

"ఎందు కివ్వలేదు? మర్చిపోయారేమో? మళ్ళీ అడిగావా?"

"అడిగానండీ! నాకే ఇచ్చేశానన్నారు. నా కసలు ఇవ్వనే లేదు."

"మరి ఇవ్వలేదని చెప్పకపోయావా?"

"మీకు తెలీదండీ, తిడతారు."

"నువ్వు చెప్పేది నిజమేనా?" అనబోయి చాలా ప్రయత్నంతో ఆగాడు వేణు. అప్పుడే అతని ప్రవర్తన మీద అనుమానాలు తనకే!

"మరి మీ నాన్నకి చెప్పావా?"

"లేదండీ, కేకలేస్తారు."

"ఎందుకు కేకలేస్తారు? వెళ్ళి మాష్టార్ని అడుగుతారు. లేకపోతే ఇంకో పెన్ను కొనిస్తారు."

"మీకు తెలీదండీ, కేకలేస్తారు."

వేణుకి చాలా విషయాలు తెలీవని కృష్ణకి బాగా నమ్మకం — "మా అమ్మకి చెప్పాను. ప్రసాద్ మామయ్య గార్ని అడగమంది!"

"అడిగావా?"

మాట్లాడలేదు, ఊరుకున్నాడు. వేణు ఇక రెట్టించలేదు. మర్నాడు కొత్త పెన్ను తెచ్చిపెట్టాడు కృష్ణకి.

ఆ తర్వాత కృష్ణ మరీ దగ్గిరయ్యాడు వేణుకి. తనకై తనే ఇంట్లో విషయాలన్నీ చెప్తూ వుంటాడు తనకి. వాళ్ళ నాన్న ఆరోగ్యం ఎప్పుడూ బాగుండదు. ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. ఎప్పుడూ డబ్బులుండవు ఇంట్లో. చిన్న చెల్లెలి కాళ్ళకి ఏదో జబ్బు! లేచి సరిగా నడవదు. వాళ్ళ అమ్మ అస్తమానూ ఏడుస్తుంది. ఈ మధ్య వాళ్ళ నాన్న అన్నిటికీ పోట్లాడుతున్నాడు. క్రిష్ణకి తండ్రి అంటే ఇష్టమే అయినా, తల్లిమీద ఎక్కువ ఇష్టం. తల్లి చెప్పే పనులు చాలా నమ్మకంగా చేస్తాడు.

కృష్ణ మాటలు విన్న తర్వాత వేణుగోపాల్‌కి పద్మావతిమీద కొంచెం సానుభూతి కలిగింది. కొట్టినా తిట్టినా కూడా పిల్లల ప్రేమకి పాత్రులయ్యే తల్లిదండ్రులు ఎప్పుడూ మంచి వాళ్ళే.

'కృష్ణ మనసులో తల్లిమీద ఇప్పుడున్నంత ప్రేమ .... ఎప్పుడూ వుంటుందా? ఆమెకీ ప్రసాద్‌కీ వున్న సంబంధం ఎలాంటిదో తెలిశాక కూడా వుంటుందా? — అనుకున్నాడు వేణు. క్రిష్ణమీద చాలా జాలేసింది.

ఒకరోజు కృష్ణ దిగాలుపడుతూ ఇంట్లో పోట్లాట సంగతి చెప్పాడు. వాళ్ళ నాన్న వాళ్ళమ్మని తిట్టి అన్నం తినకుండా బయటికి వెళ్ళిపోయాడు. వాళ్ళమ్మ ఆ రోజంతా ఏడుస్తూనే వుంది. వాళ్ళింటికి ప్రసాద్ వొచ్చి

వెళ్ళింతర్వాతే ఆ గొడవ జరిగింది. వేణు ఏమీ అడక్కుండానే కృష్ణ అదంతా చెప్పాడు. అతను చెప్పింది శ్రద్ధగా విని, అతని విచారమో, సంతోషమో పంచుకుంటాడు వేణు.

కృష్ణ మాటలవల్ల, ప్రసాద్ సంగతి అతని తండ్రికి తెలిసినట్టు అర్థం అవుతోంది. చాలా ప్రమాదం. ఇంట్లో తల్లీ తండ్రీ పోట్లాడుకుంటూ వుంటే .... ఆ చిన్న పిల్లల స్థితి ఎలా వుంటుందో ఊహిస్తే వేణుకి చాలా ఆందోళనగా అనిపించింది.

ప్రసాద్‌ని కొంచెం హెచ్చరిస్తే బాగుంటుందా? .... పిచ్చిగానీ వింటాడా? వింటాడని కాదు. కొంచెమన్నా ఆలోచించడా? .... ఎంత కాదనుకున్నా ఆ ఆలోచన వొదుల్చుకోలేకపోయాడు వేణు.

అర్ధరాత్రి, ప్రసాద్, రూము తలుపులు దబదబా బాదాడు. వేణు తలుపులు తియ్యటమే ఆలస్యంగా ఇంట్లోకి దూసుకొచ్చి — "ఏమిటోయ్! వొంటిగంటకే నిద్రా నువ్వూనూ" అని విసుక్కున్నాడు.

వేణుకి నిద్రమత్తులో కూడా కోపం వొచ్చింది "నిద్ర మానేసి నన్ను కూడా ఇళ్ళవెంట తిరగమంటావా?" అన్నాడు.

"నీ మొహం! నీకేం చేతనవుతుందిలే, పడుకో."

"ఇంకేం పడుకోను? అంతా చెడగొట్టావు. రేపట్నించీ ఇలాగ వేళాపాళా లేకుండా వస్తే, అసలు తలుపు తియ్యను, ఏమనుకున్నావో!"

"ఏమిటివ్వాళ, అంత మండిపడుతున్నావు?"

ప్రసాద్, బట్టలు మార్చుకుని మంచం ఎక్కాడు.

"ఎప్పుడైనా అతనికి తెలిసిపోతే ఏం చేస్తావు?" — వేణు.

"పరుగెత్తడానికి కాళ్ళల్లో బలం వుందిలే."

"ఛ, ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడతావోయ్!" అని వేణు మొహం చిట్లించాడు — "ఎందుకీ దొంగ బతుకు? నీకిదేం సుఖం? ఈ తొందర .... ఈ భయం .... ఏం ఆనందం నీకు?"

"నీకు తెలీదులే, ఊరుకో" అని హాస్యంలోకి దించి తప్పించుకోబోయాడు.

వేణు, ఆ అవకాశం వదలదల్చుకోలేదు. "అవును. నా కెలాగూ తెలీదు. ఈ దొంగ సంబంధాలు నాకు తెలియక్కరలేదు. నాకు తెలిసిందేమిటో తెలుసా? జీవిత సర్వస్వం అనిపించే అమ్మాయిని ఎంచుకుని, ఏ భయాలూ ఏ చాటుమాటు వ్యవహారాలూ లేకుండా నిశ్చింతగా బతకాలని. అదే తెలుసు గానీ, ఈ తిరుగుళ్ళు నాకు తెలీదులే."

ప్రసాద్ హేళనగా నవ్వాడు — "సరే, నువ్వు అలాగే కలలు కనవోయ్, కానీ, నేనిప్పుడు చెపుతున్నాను. నీ కలలన్నీ కల్లలవుతాయి. అంత గొప్ప ఆడపిల్లలెవరూ లేరు లోకంలో. వాళ్ళని నీ గుండెల్లో పెట్టుకుని పూజిస్తానంటే, దానితో వాళ్ళకి సంతృప్తి వుండదు. పట్టుకోకలూ నగలూ తెచ్చి పడేస్తూ వుండాలి. ఇప్పటి రోజుల్లో అయితే అమెరికా ప్రయాణాలు కూడా చేయించాలి. నీ కిదంతా తెలీదులే"

వేణు ఆగ్రహంగా చూశాడు — "ఆడపిల్లల మీద నీకు ఇంత మంచి అభిప్రాయం వుందా! నీ చెల్లెళ్ళయినా అంతేనా?"

"ఆఁ, చెల్లెళ్ళయినా అంతే, అక్కలయినా అంతే!"

"మొగవాళ్ళయితే ఆడవాళ్ళలాగ కాకుండా, ప్రేమ కోసమే విలువ ఇస్తారా? ప్రేమ చూపిస్తే సంతృప్తిపడి పోతారా?"

"అబ్బా! ఈ అర్ధరాత్రి ఈ గొలంతా ఎందుగ్గానీ, పద్మావతికి డబ్బుతో ఎంత అవసరమో తెలుసా?"

వేణు తెల్లబోయాడు — "అయితే డబ్బు ఇయ్యి! నీ అక్కే కదా? పేద మనిషి కదా?"

"ఆమెకి డబ్బుతో అవసరం. నాకు ...."

"ఆమె శరీరంతో అవసరమా?"

"బాగా గ్రహించావే!"

"ఛీ! ఇలాంటి మూర్ఖుడితో మాటలేవిటి!" అనిపించింది వేణుకి. 'ఇతనితో ఒక్కగదిలో కలిసి బతకడమా! ఇతనేం మారతాడు? ఏం తెలుసుకుంటాడు? ఈ దరిద్రంనించి ఎంత దూరంగా వుంటే అంత మంచిది. ఇంకో గది వెతుక్కోవలిసింది ....'

"ప్రసాద్! నీకుచాలా తెలుసు. కానీ, దేన్నీ పట్టించుకోవు. జరిగిందేదో జరిగిందనుకో. అది పోనియ్యి! ఇక ఇదంతా వొదిలెయ్యి!"

ప్రసాద్ నవ్వాడు — "పేదవాళ్ళని చూసి జాలిపడతావు. చిన్నపిల్లల్ని చూసి జాలిపడతావు. నన్ను కూడా చూసి జాలిపడవోయ్ కొంచెం!"

"చాలా బాగున్నాయి నీ మాటలు! నిన్ను చూసి

ఒకళ్ళు జాలిపడేంత ఖర్మ నీకెందుకూ? నీ కిష్టమైన అమ్మాయిని పెళ్ళిచేసుకుని సంతోషంగా బతక రాదూ?" — ప్రసాద్‌తో శాంతంగా మాట్లాడితే అతను కొంచెమన్నా ఆలోచిస్తాడేమో అనిపించింది వేణుకి ఆ క్షణాల్లో.

వేణు శాంతాన్ని ప్రసాద్ ఒక్క క్షణంలో తీసి పారేశాడు — "పెళ్ళా? చెప్పేశావు తేలిగ్గా. మా అమ్మకి జాతకాలు — మా నాన్నకి కట్నాలు — మా చెల్లెళ్ళకి లాంఛనాలు — మా చుట్టాలకి కులగోత్రాలు — ఇంకా సంఘానికీ, దేవుళ్ళకీ ఏవేవో! ఇన్నిటి మధ్య ఇరికి పెళ్ళి చేసుకోవాలి! ఎవరైనా సరే, తన పెళ్ళితో, చుట్టూ ఇంతమందికి ఆనందం కలిగించాలి. ఇక పెళ్ళి చేసుకునే వాళ్ళ ఇష్టాయిష్టా లెక్కడున్నా యోయ్!"

"అదేమిటి! వాళ్ళందరి ఇష్టాలకీ నువ్వెందుకు విలువ ఇవ్వాలి? అవన్నీ తప్పులని నీకు తెలిసినప్పుడు వాళ్ళ ప్రకారం నువ్వెందుకు నడవాలి? నీ ఇష్టం ప్రకారమే నువ్వు నడుచుకో. జాతకాలూ గీతకాలూ చూడకుండా నీకిష్టమైన అమ్మాయినే నువ్వు పెళ్ళి చేసుకో! నువ్వు చెయ్యవలసింది తెలీనట్టు అందర్నీ తప్పుపడతావెందుకు?"

"తెలుసు బాబూ, అన్నీ తెలుసు, వీటన్నిటినీ ధిక్కరించాలంటే, అంత ప్రేమ నాకెవరి మీదైనా కలగాలి కదా? ఏ అమ్మాయికైనా అంతప్రేమ నా మీద కూడా కలగాలి కదా? నిజం చెప్పాలంటే, నేను అంత గొప్పవాణ్ణి కానోయ్! నా వ్యక్తిత్వం ఏం గొప్పది? నేనూ లోకాచారాలన్నిటికీ లొంగిపోయేవాడినే. నేనూ నలుగురితోపాటే!"

"నలుగుర్నీ విమర్శించే నువ్వు ఆ నలుగురి లాగానే ఎందుకు ప్రవర్తించాలి? ఆ తప్పులే నువ్వూ చేస్తావా?"

"తప్పులో ఒప్పులో! అదే సుఖం! ఏటికి ఎదురీదే ఓపిక నాకు లేదు బాబూ!"

"నీకు లేదుగానీ, ఆ ఓపిక ఇతర్లకి వుండాలన్న మాట! అంతేనా?"

"నీ ఇష్టం. ఎలాగైనా అనుకో!"

"మారడం ఇష్టంలేక ఇలా మాట్లాడుతున్నావు. ప్రసాద్! నీకు అన్నీ తెలుసు. నీ జీవితం నువ్వే నిర్ణయించుకో లేవూ?"

"ఇప్పుడు నిర్ణయించుకున్నాను కదోయ్!" అని నవ్వాడు ప్రసాద్.

"అంటే ఈ వ్యభిచారమే నిర్ణయించుకున్నావా?"

"పెళ్ళి కూడా వ్యభిచారమేలే పోదూ! పెళ్ళి చేసుకున్న వాళ్ళ జీవితాలూ ఇలాగే ఏడుస్తున్నాయి. సంఘమే ఇలా ఏడుస్తోంది!"

వేణుకి విసుగేసింది. "మళ్ళీ అదే మాటా! సంఘా నికి ఎదురుతిరిగి నీ జీవితాన్ని సరిగా నడుపుకోరాదూ? అందర్లాగే నువ్వూ బతకడం ఎందుకు?" — వేణు మళ్ళీ అదే ప్రశ్న.

"నా కంత ఓపిక లేదని చెప్పానా?" — ప్రసాద్ మళ్ళీ అదే జవాబు.

"సంఘం పిచ్చికుక్కలాంటిది. దాన్ని తప్పించుకు పోతూ వుండాలి గానీ, దాంతో పోట్లాటకి దిగితే, మనల్ని కరిచి కరిచి మనక్కూడా పిచ్చెక్కిస్తుంది. నీలాగే నాకూ పునర్జన్మల మీద నమ్మకం లేదు. లేక పోతే ఈ జన్మని నువ్వనే మంచి జీవితంకోసం బలిచేసి వుందును."

"అంటే, నువ్వు నీ వ్యవహారం మానుకోనని చెప్పేస్తున్నావు!"

"లేదులేవోయ్, మారదాంలే! ఇక పడుకోనిస్తావా లేదా?"

ఏవిటీ మనిషి! పెద్ద పెద్ద మాటలు మాట్లాడ తాడు. అందర్నీ అన్నిటినీ విమర్శిస్తాడు. కానీ, తనూ అందర్లాగే!

నిజానికి, అందరూ ఇంత అవకాశవాదులు కారు.

★ ★ ★

కృష్ణ సంతోషంగా వున్నాడంటే వాళ్ళమ్మ సంతోషంగా వుందని అర్థం. అతను దిగులుగా వున్నా డంటే, వాళ్ళింట్లో ఏవో పోట్లాటలు జరుగుతున్నాయని అర్థం.

కృష్ణ నాలుగైదు రోజుల్నించీ చాలా విచారంగా కనబడుతున్నాడు. ప్రసాద్‌కోసం రోజుకి నాలుగైదు సార్లు వొచ్చి అడుగుతున్నాడు. ప్రసాద్ ఎక్కడికి

వెళ్ళాడోగానీ రూంకే రావటం లేదు.

"డబ్బేమైనా కావాలా?" అని వేణు అడిగితే — "కాదు. మామయ్యగార్ని మా అమ్మ తప్పకుండా తీసుకు రమ్మంది" అన్నాడు. చాలా నిరాశపడుతూ తిరిగి వెళ్తున్నాడు.

ఆ సాయంత్రం కృష్ణ వేణుకో ఉత్తరం తెచ్చి ఇచ్చాడు. పద్మావతి నమస్కారాలతో, కన్నీళ్ళతో ఆ ఉత్తరం రాసింది — వేణుకే. ఆమెకి మూడో నెల! భర్తతో ఆమెకి కొన్ని నెలలనించీ సంబంధం లేదు. కాబట్టి, ఇది భర్తకి తెలీకూడని విషయం. వెంటనే ఎబార్షన్ చేయించుకోవాలి. ఎలాగైనా ప్రసాద్‌ని పంపించమని ప్రార్థన అది. తమ రహస్యం వేణుకి తెలిసిందే కాబట్టి ఆమె వేణుకి నిజం చెప్పేసింది.

వేణుకేం చెయ్యాలో తోచలేదు. ప్రసాద్ కోసం తిరిగాడు. అతనెక్కడా దొరక్క రాత్రి రూం కొచ్చేసరికి .... ప్రసాద్ రూమ్‌లో బట్టలు సర్దుకుంటున్నాడు హడావుడిగా.

"ఎక్కడికెళ్తున్నావు?" అన్నాడు వేణు, ఆశ్చర్య పోతూ.

ప్రసాద్ కంగారుపడి "పనుంది, వెళ్ళాలి" అన్నాడు పెట్టి మూస్తూ.

"ఇప్పుడా? ఈ ఉత్తరం చూడు!" అని పద్మావతి ఉత్తరం పెట్టిమీద పెట్టాడు వేణు.

ప్రసాద్ గబగబా అది చదివి చింపేశాడు. పర్స్‌లోంచి డబ్బు తీసి లెక్కపెట్టి టేబుల్‌మీద పెట్టాడు — "కొంచెం నువ్వెళ్ళి ఇచ్చెయ్యవోయ్! ఆ కృష్ణచేతి కివ్వకు. వాడు సగం కొట్టేస్తాడు" అని మళ్ళీ పెట్టి మూత ఎత్తి బట్టలు సర్దటంలో పడ్డాడు.

వేణు తెల్లబోయి — "ఇంత అర్జంటుగా నీ ప్రయాణం ఎక్కడికి? ఆవిడ ఎంతో భయపడుతూ రాసింది. ఒకసారి వెళ్ళి మాట్లాడవూ? నీ సహాయం కావాలికదా?" అన్నాడు.

"అబ్బే, నాకు వీలుకాదోయ్! నన్నేం చెయ్య మంటావు? ఇలాంటివన్నీ ఆవిడ మొదటే ఆలోచించు కోవాలి. నన్నడిగితే నేనేం చెప్పను?" అని విసుక్కు న్నాడు ప్రసాద్.

"మొదట నువ్వు మాత్రం ఆలోచించక్కరలేదా?"

"ఎందుకు ఆలోచించలేదూ? ఇలాంటివన్నీ తనే చూసుకుంటుందనుకున్నాను."

"అలా ఆలోచించావా!"

మొదట్లో అతను ఆమె కోసం ఎంత తాపత్రయ పడి తిరిగాడో .... ఆమె నిజంగా జడిసినప్పుడు ఎలాంటి మాటలు చెప్పాడో, అవన్నీ అతనికిప్పుడు జ్ఞాపకం లేవు. ఆస్పత్రులూ .... డాక్టర్లూ .... ఆమె కోసం తను నవ్వుల పాలవడం .... అతని కేమీ ఇష్టం లేదు.

పెట్టి మూసి వేణుగోపాల్‌ని చూస్తూ "పోనీ నువ్వే చెప్పు! నా వొక్కడిదేనా తప్పు?" అని తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోబోయాడు.

వేణు ఆశ్చర్యపడి — "ఇప్పుడు తప్పు సంగ తెందుకు? జరగాల్సిందేదో చూడాలి. అసలిది తప్పు కాదని నువ్వే వాదిస్తావు. తప్పు ఇద్దరి దీనూ! ఇలాంటి సమయంలో ఆవిణ్ణి వొదిలేసిపోతే ఎలాగ ప్రసాద్?" అన్నాడు కంగారుగా.

"అందుకే కదోయ్ డబ్బిచ్చింది?"

"డబ్బేనా ఆవిడడిగింది?"

"చేసే వాళ్ళుంటే ఎన్నయినా అడుగుతారు. ఆవిడకీ నాకూ వున్నది డబ్బు సంబంధమే. అది ఇవ్వడం కన్నా నేనేం చెయ్యగల్ను?"

"ఆవిడ డబ్బు తీసుకోకపోతే?"

"అతనికియ్యి! మహాచక్కగా తీసుకుంటాడు."

"ప్రసాద్! .... వాళ్ళని గురించి ఎందుకంత హీనంగా మాట్లాడుతున్నావు?"

"వాళ్ళు అంత హీనులు గనక! మా సంబంధం అతనికీ తెలుసు. తెలిసి ఊరుకోలేదా? నేనిచ్చే డబ్బు వాడుకోలేదా? వాళ్ళ గురించి ఇంకేం ఆలోచించ మంటావు?"

అతనితో వాదించేకన్నా, ఎలాగైనా అతని ప్రయాణం ఆపాలని కంగారు కలిగింది వేణుకి. అతని మీద కోపాన్ని అణుచుకుంటూ సాధ్యమైనంత అనునయంగా అన్నాడు — "ప్రసాద్! కొన్ని రోజులైనా ఆవిడతో ఆనందపడ్డావు. అందుకైనా కృతజ్ఞత లేదా? కనీసం .... జాలి కలగటం లేదా? .... ఒక్కసారి న్యాయంగా ఆలోచించి చూడు. నిజంగా నీకు మనసు

లేదా?"

ప్రసాద్ కంగారుగా అన్నాడు — "ఇన్నాళ్ళూ నేనూ లేదనుకున్నాను గానీ .... నా క్కూడా మనసుందేమో నని భయం వేస్తోంది వేణూ! అక్క నాకీ మాట చెప్పినప్పట్నించీ ఇదే ఆలోచిస్తున్నాను. ఏ అర్ధరాత్రో ఆవిడ వొచ్చిపడి ఏడిస్తే .... అదేం కుదరదోయ్! అర్జంటుగా వెళ్ళాలి. అన్నీ తను చూసుకోగలదులే. ఒక డాక్టర్ని పట్టుకుంటే పనైపోతుంది. ఇలాంటి వాళ్ళకి ఇవన్నీ అలవాటే!"

వేణు మాట్లాడలేదు, ఇక.

పది నిమిషాల్లో ప్రసాద్ సూట్‌కేస్ పట్టుకుని వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన వెంటనే కృష్ణ మళ్ళీ వచ్చి — "మామయ్యగారొచ్చారాండీ!" అని అడిగాడు.

పది గంటల రాత్రి కృష్ణకేం చెప్పాలో తోచక — "అమ్మకి వొంట్లో ఎలా వుంది?" అన్నాడు.

"పడుకుని ఏడుస్తోందండీ!" అన్నాడు కృష్ణ ఏడుపు మొహంతో.

"నాన్నగారున్నారా?"

"లేరండీ! ఇప్పుడే డ్యూటీకి వెళ్ళారు. మామయ్యగా రెప్పుడొస్తారండీ?"

"నేనొస్తున్నాను పద" అని వేణు తన దగ్గిర డబ్బు కూడా కొంతతీసి ప్రసాద్ ఇచ్చిన డబ్బుతో కలిపి పాంటుజేబులో పెట్టుకున్నాడు.

వేణు వొస్తాననగానే కృష్ణ మొహం వికసించింది. "మీరొస్తారా? మా ఇంటికా?" అని ఆశ్చర్యంగా చూశాడు.

వేణు కృష్ణ చెయ్యి పట్టుకుని రోడ్డు దాటి ఎదరింట్లోకి వెళ్ళాడు.

"అమ్మా! వేణుగారొచ్చారు" అని కృష్ణ సంబరంగా చెప్పాడు.

పద్మావతి కంగారుపడుతూ మధ్య గుమ్మంవరకూ వొచ్చి కొంచెం తలవంచుకుని నించుంది. రెండు గదులు. చాలా చిన్నవి. ఇరుకు. గడప దగ్గిర ముక్కాలి పీట మీద కిరసనాయిలు దీపం వెలుగుతోంది. కృష్ణ వొత్తి పెద్దది చేశాడు. గదుల్లో సామానులు కొంచెం వివరంగా కనపడ్డాయి. చిన్న పిల్లలిద్దరూ చాపమీద పడుకుని నిద్రపోతున్నారు.

"కూర్చోండి!" అని కృష్ణ ఎత్తుపీట తెచ్చివేశాడు.

వేణు కూర్చోలేదు. జేబులోంచి డబ్బుతీసి ఆ పీటమీద పెట్టాడు. "మీ కిమ్మని ప్రసాద్ ఇచ్చాడండీ!" అన్నాడు పద్మావతితో.

"డబ్బా? ఎందుకూ?" అని తెల్లబోయిందామె. వెంటనే "ఆయనెందుకు రాలేదూ?" అని ఆందోళనగా అడిగింది.

"అతని కేదో అర్జంటు పని వొచ్చిందన్నాడు. ఇంటి దగ్గిర ఎవరికో బాగా లేదని ఉత్తరం వొచ్చి నట్టుంది, ఈ డబ్బు మీ కిమ్మని ...."

"నాకు ఒక్కసారి చెప్పి వెళ్ళవచ్చుకదా?" చాలా నెమ్మదిగా దిగులుగా అంది.

"అవును. నేనూ అదే అన్నాను. కానీ ...."

"రెండు వారాలనించీ ఆయన నాకు కనిపించనే లేదండీ! ఎన్నిసార్లో కబురంపాను. ఎంత చిత్రంగా మారిపోయా రాయన!" అంది. దాదాపు కంఠం దుఃఖంతో ఆగిపోయింది. కంఠం నిండా కోపం కూడా ధ్వనించింది.

ఆమెకి కొంచెం ధైర్యం కలిగించాలనిపించింది, వేణుకి.

"కాదండీ! మీరు బాధపడొద్దు. తొందరగా వొచ్చేస్తాడనుకుంటాను. ఇంకా ఆలస్యం చెయ్యకుండా మీరు డాక్టర్ దగ్గిరికి వెళ్ళండి! అతను తొందరగానే రావచ్చు."

"మీకు తెలీదు" కటువుగా మందలించినట్టు అని, గుమ్మానికి తల ఆన్చుకుని, నిశ్శబ్దంగా ఏడుస్తూ నిలబడింది.

వేణు భరించలేక "మీరేం బాధపడకండి అక్కయ్యగారూ!" అనబోయి చాలా ప్రయత్నంమీద ఆగాడు .... వొద్దు ఆ పిలుపు! .... దాని పవిత్రత అంతా పోయింది. అలా పిలిస్తే, ఆమె నమ్మదు. తనని కూడా ఇంకో ప్రసాద్ అనుకుంటుంది.

కృష్ణ దిగాలుగా, "మా అమ్మకోసం మీరేమీ చెయ్యలేరా?" అన్నట్టు చూస్తున్నాడు.

ఆమె, ఏడుపు ఆపుకోవాలని నిశ్శబ్దంగా విశ్వ ప్రయత్నం చేస్తోంది. కానీ చెంపలమీద కన్నీళ్ళు ఆ

లేత వెలుగులో వర్షాకాలపు నదుల్లాగ వేగంగా దారలుకట్టి జారుతూ మెరుస్తున్నాయి. ఇంత ఆవేదన .... ఇంత దుఃఖం .... ఎప్పటికి ఉపశమిస్తుంది? ఎవరు ఓదార్చగలరు? ఈ పరిస్తితిలో ఈమెకి తప్పనిసరా? ముగ్గురు పిల్లల తల్లి! తమ్ముడు వరస మనిషితో! పేదతనానికి, ఈ దారి తప్పడమేనా, సరైన దారి? ఈమెకి ఇంకో దారేలేదా?

కానీ, మళ్ళీ పుట్టెడు జాలి! ఆమె పరిస్తితి ఇప్పుడు .... నాలుగో బిడ్డ! అంతా రహస్యం! దాన్ని వదిలించుకోవాలి!

ఆమె కష్టం పంచుకోవాలనే వాత్సల్యంతో తల ముస్కలై ఇంకా ఒక్క అడుగు ముందుకువేసి "మీరేం బాధపడకండి అక్కయ్యగారూ!" అన్నాడు అప్రయత్నంగా. ఆ పిలుపు దూసుకొచ్చేసింది. నోరు జారిపోయింది వాత్సల్యంతో.

ఆమె మండిపడి కళ్ళెఱ్ఱ జేస్తూ చూసింది — "వెళ్ళవతలకి! ఎవరికి తమ్ముడివి నువ్వు? ముందు కదులు ఇంట్లోంచి" అని అరిచింది.

వేణు వొక్క అంగుళంకూడా కదలలేదు. అతను చాలాసేపు తల వొంచుకుని నించున్నాడు. కొంతసేపటికి తలెత్తి పద్మావతిని చూశాడు — "మీకెప్పుడైనా అవసరమైతే నా దగ్గిరికి కృష్ణని పంపించండి అక్కయ్యగారూ! నేను మీ కెల్లాంటి తమ్ముణ్ణో నాకూ తెలీదు. కానీ మీకేం సహాయం కావాలన్నా చేస్తాను. నేను ప్రసాద్‌లాంటి తమ్ముణ్ణి కాను. నన్ను నమ్మండి అక్కయ్యగారూ! నాకు చెప్పటానికి మీరేమీ సందేహించవద్దు" అని ఎప్పట్లాగే నించున్నాడు.

పద్మావతి తెల్లబోయి మాట్లాడలేకపోయింది.

" .... ధైర్యంగా వుండండి అక్కయ్యగారూ!" అని వేణు గుమ్మంవేపు నడిచాడు.

పద్మావతి దుఃఖం ఆపుకుని — "ఆ డబ్బు నా కక్కర్లేదు? తీసికెళ్ళి అతనికే పంపించెయ్యండీ" అంది కోపంగా.

వేణు వెనక్కి తిరిగి ఆమెని చూశాడు. రెండు నిమిషాలు నించున్నాడు. డబ్బుతీసి జేబులో పెట్టుకున్నాడు.

పద్మావతి స్వరమంతా కృతజ్ఞతతో నిండింది — "మా చిన్న పిల్లకి ఎంత జబ్బు చేసిందో మీకు తెలీదు. మందులు వాడకపోతే పిల్ల చచ్చిపోయేది. నేనీ దరిద్రంతో డబ్బుకి వొళ్ళమ్ముకున్న మాట నిజమే. మనసు కూడా అమ్ముకున్నాననుకోకండి" ఆ రెండు మాటలూ అతనితో అనాలని ఆమె ఆతృతపడింది.

వేణు వినయంగా విన్నాడు.

"కానీ .... ఉంచండి అక్కయ్యగారూ! ఇప్పుడు దీనితో మీకు చాలా అవసరం ఉంది" అని నెమ్మదిగా జేబులోనించి డబ్బుతీసి మళ్ళీ బల్లమీద పెట్టాడు.

పద్మావతి మళ్ళీ ఏడ్చింది "పిల్ల చచ్చిపోతుందనే భయంతో ఇంత నీచానికి తలపడ్డాను. కానీ, ఇప్పుడు కడుపులో బిడ్డని చంపుకోకతప్పడం లేదు. ఏం తల్లిని నేను? రాక్షసినండీ, రాక్షసిని! దారి తప్పి ఏం సాధించాను? అయ్యో, కళ్ళు మూసుకుపోయి ప్రవర్తించాను."

వేణుకి ఏం చెప్పాలో తోచలేదు. "వొద్దు, ఏడవకండి. మీరిలా వుంటే పిల్లలు బెదిరిపోతారు. కొంచెం ఓర్చుకోండి అక్కయ్యగారూ!"

"మీరెంతో మంచివారని క్రిష్ణ చెపుతాడు. నా మీద అసహ్యం పెట్టుకోకండి ...."

"అయ్యో, అలా అనొద్దు! మీ పరిస్తితి చెప్పారు కదా?"

కొంతసేపు నిలబడి బయటికి వచ్చాడు.

కృష్ణకూడా అతని వెనకాల వొచ్చాడు.

"మా అమ్మ మిమ్మల్ని తిట్టిందెందుకండీ?" అన్నాడు ఆశ్చర్యపడుతూ.

"అమ్మ మనసేం బాగాలేదోయ్ .... కృష్ణా! నువ్వు అమ్మతో ప్రేమగా ఉండాలి. ఏం? చెల్లెళ్ళు చిన్నవాళ్ళు కదా?"

కృష్ణ కళ్ళెత్తి చూశాడు చాలా నిర్మలంగా.

వేణు వెనక్కి వస్తూ అనుకున్నాడు — పద్మావతి ఆత్మాభిమానం గల మనిషే! కానీ .... ఆమెనికూడా పతనం చేసేంత హీన పరిస్థితులున్నాయి. రేపు ఇవన్నీ ఆలోచిస్తాడా కృష్ణ? అతను పెద్దవాడై, తల్లి నీతి లేని మనిషని అసహ్యించుకుంటాడేమో ....!

[28-7-72 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో]★